# చిత్రం

జి. రంగబాబు

**రైల్వేగ్రౌండ్స్‌లో పారిశ్రామిక ప్రదర్శన.**

**పూర్తిగా చీకటి పడకుండానే రంగు రంగుల దీపాలు వెలిగిపోతున్నాయి. మైకులు పాటలతో హోరెక్కిస్తున్నాయి. విదేశీవాసులకే కొంచెం వింతగా అనిపించే ఫలహారశాలలూ, వినూత్నమైన పానీయశాలలూ - విజృంభిస్తూ వాణిజ్యం చేస్తున్నాయి.**

రాక్షసచక్రం (జయంట్ వీల్) రకరకాలుగా మనుషుల్ని రారమ్మంటోంది. రోబోలు, రాకెట్‌లు, రోప్‌వేలు, హైటెక్ రంగుల రాట్నాలు. ఎన్నో విధాలయిన జనాకర్షణలు. వాటిముందు పెద్దలే పిల్లలైపోతున్నారు. పిల్లలు పెద్దలౌతున్నారు.

అక్కడ జనం. అక్కడ సందడి. అక్కడ సరదా. అక్కడ కాలక్షేపం. పిల్లలు, పెద్దలు, స్త్రీలు, వృద్ధులు రంగురంగుల రకరకాల దుస్తుల్లో వర్ణచిత్రాలు కదులుతున్నట్లు అందమైన అమ్మాయిలనే వెంటాడుతూ అబ్బాయిలు.

లోకోభిన్నరుచిః - నానుడిని నిజంచేస్తూ, కొందరు తినడానికే వచ్చినట్లు ఫలహారశాలలలో పీఠం వేస్తే, కొందరు వినోదాలు చేస్తూ జయింట్‌వీల్‌కో రాకెట్‌కో అంటుకుపోతున్నారు. కొందరు ఏమీ చెయ్యకుండా ఆవరణంతా కలియదిరుగుతున్నారు. మరి కొందరు అందాల పాపల చుట్టూ తుమ్మెదల్లా గిరికీలు కొడుతున్నారు. కొందరు కేవలమూ చూస్తూ ఆనందిస్తున్నారు.

అందరినీ చూస్తూ అన్నిటినీ పరిశీలిస్తూ మెల్లగా నడుస్తూన్న శరత్‌చంద్ర - షాక్ కొట్టినట్లే ఆగిపోయాడు.

ఆమె అతనికి బ్యూటీ షాకే ఇచ్చింది. నిర్ఘాంతపోయి నిర్నిమేషంగా ఆమెనే చూస్తూ తనకి తెలియకుండానే అనుసరించసాగాడు.

అందం అతనికి కొత్తకాదు. అతను నిత్యమూ చూసేదీ, ఊహించేదీ, ఊపిరిపీల్చేది అందాన్నే. కాని ఇంత సౌందర్యాన్ని అతను ఎప్పుడు ప్రత్యక్షంగానే కాదు, ఊహలో కూడా చూడలేదు. అతనిలోని అ'తను' ఒక్కసారి కళ్ళు తెరిచాడు.


సృష్టిలోని సౌందర్యాన్నంతా బ్రహ్మ ఒకే బొమ్మలాటి భామని చేస్తే.. ఆమె అందాల నదులైతే - ఆమె సౌందర్యలహరి. వర్ణనలకు భాషచాలనంత చక్కదనం.

ఆమె ఆశ్చర్యపు చూపు.. నవ్వు.. అతను జాగ్రత్తగా చూశాడు. ఆమెను ఆపాదమస్తకమూ అతి సునిశితంగా పరిశీలించాడు.

సౌందర్యారాధన కూడా ఒక విధమైన మత్తే.

ఆ మాయలో ఏమీ తెలియదు. మనిషి - తననీ, మిగిలిన ప్రపంచాన్నీ కూడా మరిచిపోతాడు. అందులోనూ - సౌందర్యోపాసనే జీవితమైతే?

నిరాడంబరమైన వస్త్రాలూ, అలంకరణలతో - అన్ని అందాలూ తన ముందు



దిగదుడుపే అని చెప్పక చెప్పి - ఆమె అంతలోనే వెళ్ళిపోయింది.

శరత్‌చంద్రకి కారులేదు. కాలినడకనే బయలుదేరాడు. అతనికి నడకమీద ధ్యాస లేదు. అలవాటుగా నడుస్తున్నాడు. అతని దృష్టంతా - ఆ అతిలోక సౌందర్యం మీదే.

పరధ్యానంగానే ఇల్లు చేరాడు.

ఆ అందానికి దూరమైనా ఆవేదన తగ్గడం లేదు. మనసు నిండా మథనం. హృదయంలో అస్తిమితం. ఏం చెయ్యడానికీ తోచని తనం. ఏదో తపన, వేదన, తియ్యని బాధ, నిలవ నీయకుండా. బలహీనత, ఘర్షణ.

అతను గదిలోకి వెళ్ళి తలుపు మూసు కున్నాడు. తనని తానే మరచిపోయాడు. అదొక నిషా! అదొక తపస్సు. అనుభవించిన వాళ్ళకే అర్థమౌతుంది దాని అదృశ్య ప్రభావం. అందులో పడితే కాలమే తెలియదు. ప్రపం చమే మరపున పడుతుంది.

కొన్ని గంటల తరవాత -

శరత్‌చంద్ర గది తలుపులు తెరిచాడు.

అతను చాలా అలసిపోయినట్లుగా కనిపిస్తు న్నాడు. జుత్తు చెదిరి శరీరం కొంచెం చెమటలు పట్టి నీరసంగా కనిపిస్తున్నాడు. కానీ అతని కళ్ళల్లో ఏదో కాంతి. మనిషిలో దేని నుంచో బయటపడినట్లు విశ్రాంతి. ఒక విధమైన హాయి. గుండెలమీంచి కొండను దింపు కున్నట్లు.

"రవీ! ఎంతసేపైంది వొచ్చి?" అతని ప్రక్కనే సోఫాలో కూర్చుంటూ అడిగాడు.

"చాలా సేపే అయింది - " నవ్వాడు రవి. గడియారం చూపిస్తూ. పన్నెండు!

"క్లబ్ యివాళ డల్‌గా ఉందని, పద కొండుకే కార్యక్రమాలు ముగించేశారు. పావు గంటలో వొచ్చేశాను. అర్ధరాత్రులు నాకు అల వాటే కదా. నువ్వెందుకు యింతవరకూ మేలు కుని కూర్చున్నావ్? అర్జంటు పనా?" అడిగాడు రవి. ఫ్లాస్కులోంచి ఇద్దరికీ టీ పోస్తూ శరత్ చంద్ర - సిగ్గుపడుతున్నట్లు ఏమీ చెప్పలేదు.

వాళ్ళిద్దరూ చిన్నప్పుటినుంచీ స్నేహితులే. శరత్‌చంద్ర చిత్రలేఖనంలోనూ, రవి సంగీతం లోనూ పడి చదువుని అశ్రద్ధచేశారు. తమ 'కళ' మీద ఎన్నో కలలు కనేవారు.

కళ వారిని ఉద్ధరించలేదు. అలాగని ఉసురుపెట్టనూలేదు. ఆమాత్రం ఉపాధి కల్పిం చింది. బతకడానికి చిన్నతోవ చూపింది. చిత్ర కారుడిగా శరత్‌చంద్ర కొంచెం పేరూ, కొంచెం డబ్బూ సంపాదించుకోగలుగుతున్నాడు. హోట ళ్ళకీ, బార్లకీ చిత్రాలు అమ్ముతుంటాడు. ఒక స్థానిక పత్రికకి కార్టూన్ కాలమిస్తు.

రవి నైట్‌క్లబ్‌లో గిటార్ వాద్యగాడిగా, పాటకుడిగా పనిచేస్తున్నాడు. అవకాశాలు దొరి కితే పైచోట్లకూడా పాడుతుంటాడు.

ఇద్దరు కలసి ఆ మేడ మీది భాగం అద్దెకు తీసుకుని ఉంటున్నారు. శరత్‌చంద్ర స్టుడియో, రవి రిహార్సల్ రూమ్. అన్నీ అక్కడే. వాళ్ళకి జీవితం బాగానే వెళ్ళిపోతోంది. ఇద్దరూ బ్రహ్మ చారులే. టీ తాగడంతో ఇద్దరికీ నిద్రముంచు కొచ్చింది.

❋ ❋ ❋


టెలిఫోన్ మోగింది. "రాజారావ్.. చిత్రనళీ యం సెక్రటరీని. శరత్‌చంద్ర?"

"నమస్తే. నేను శరత్ ఫ్రండుని. రవిని. శరత్ నిన్న సాయంత్రం ఊరెళ్ళాడు, అర్జం టుగా"

"నమస్తే.. ఎప్పుడొస్తాడు?"

"చెప్పలేనన్నాడు. వారం పదిరోజులు పట్టొచ్చేమో"

# చలిచీమలు



'బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ' అన్నాడు శతకకారుడు ఎప్పుడో. ప్రపంచ వ్యాప్తంగా 3,500 చీమల జాతులున్నాయి. ఒక్కొక్కసారి ఒక చీమల గుంపులో లక్ష వరకు చీమలుండవచ్చు.

చీమల పుట్టకి చిచ్చు పెట్టకూడదని మన పెద్దలు చెబుతారు. జీవావరణరీత్యా ఇవి ఎంతో ప్రయోజనకారులు. మనం అజాగ్రత్తగా సరు కులు దాచుకుంటే చీమలు పట్టడం ఖాయం. కానీ ఇతరత్రా ఇంట్లోని పురుగు పుట్రా వ్యర్థపదార్థాలని పూర్తిగా నిర్మూలించి శుభ్రపరచేవివే. అయితే చీమల్లో చాలా జాతులు చాలా విధాలా జీవనం గడుపుతాయి.

సైనిక చీమలు ఒక భయంకర సమూహం. ఆఫ్రికాలో వీటిని డ్రైవర్ చీమలు అంటారు. డోరీలస్, అనోమా జాతులు. అమెరికాలో లెజిమోనరీ చీమలు అంటారు.

**అసిటన్ జాతి:** కొన్ని సందర్భాల్లో ఈ చీమలు 5 సెం.మీ. వరకు ఉంటాయి. సజీవ ఆహారాన్ని తినడం వీటి విశేషం. కేవలం పురుగు, పుట్రా అనుకోనేరు. ఆఫ్రికాలో ఎనుము, ఏనుగు, చిరుత, సింహం సయితం వీటికి భయపడి పారిపోతాయి. కట్టిపడేస్తే గుర్రం సయితం వీటికి ఆహారం అయిపోతుంది. రోగగ్రస్తమైన జంతువులు ఎంతటివైనా ఇవి తినేసి శుభ్రం చేస్తాయి.

వీటికి శాశ్వతంగా ఒక పుట్ట అంటూ ఉండదు. దేశదిమ్మరులు. సైనిక శిక్షణ రీతిలో తరలిపోతూ దారిలో దొరికిన జంతువులను తినేస్తాయి. పరిణామరీత్యా చూస్తే ఇవి పురాతన జాతులు. కేవలం మాంసాహారులు.

ఈ చీమలబారు వస్తోందనగానే మెక్సికో అటవీ ప్రాంతాల ప్రజలు ఇళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోతారు. చీమలు ఇంట్లో పురుగు పుట్రా పూర్తిగా తినేసి ఇంటిని శుభ్రం చేసి మరీ వెళ్ళిపోతాయి.

ఈ చీమల సైన్యం వస్తోంది అని ముందుగానే పక్షులు హెచ్చరిస్తాయి. నేలబారు చెట్ల మీద నుంచి గెంతుకుంటూ ఆ చీమలతో పాటు పోతూ సమస్త జంతువులకు హెచ్చరికలిస్తాయి. ఈ భయంకర చీమల శ్రేణులు ఒక కిలో మీటరు పొడవు, 20 సెం.మీ. వెడల్పు ఉండవచ్చు.

**- జమ్మి కోనేటిరావు**

"అయ్యో! ఎలా?"

"ఏమీ?"

"అనుకోకుండా.. హటాత్తుగా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చెయ్యవలసివొచ్చింది. రేపటి నుంచే ప్రదర్శన, అమ్మకాలు. శరత్ చిత్రాలు కనీసం ఒకటేనా ఉండాలి. స్థానిక చిత్రకారుల చిత్రాల ప్రదర్శన.

"అతనివి ఒక్కటేనా లేకుండా ఎలా?" బాధపడుతున్నాడు రాజారావ్.

"ఒక్క నిముషం. లైన్‌లో ఉండండి–" రవి శరత్ స్టూడియో గది తెరిచాడు. అతని సంతోషానికి మేరలేదు. వెంటనే వెనక్కి వచ్చి "రాజారావ్‌గారూ! శరత్ గీసిన తాజా చిత్రం బోర్డుమీదే ఉంది. అద్భుతమైన చిత్రం. ప్రపంచంలోని అహ.. భారతీయ సౌందర్యమంతా బహు చక్కగా ప్రతిఫలిస్తూ... సుందర స్త్రీ మూర్తి!" అరిచినట్లే అన్నాడు ఆనందంగా. "పది నిముషాల్లో వచ్చేస్తున్నాను –" అని రిసీవరు పెట్టేశాడు రాజారావు. అతను పట్టుకెళ్ళేందుకు వీలుగా చిత్రాన్ని ప్యాక్ చేసి ఉంచాడు రవి.

❋ ❋ ❋

"రవీ!"

"శరత్! ఇన్నాళ్ళు చేశావేమిటి? వారం ఐపోయింది నువ్వెళ్ళి."

"ఈ వారంలోనూ విశేషాలేమైనా ఉన్నాయా?" అడుగుతూనే, ఏదో గుర్తుకొచ్చినట్లు వేగంగా లేచి తన స్టుడియో గది తలుపు తీశాడు.

"రవీ!" గదిలోంచే అరిచాడు.

"ఊఁ"

"నేను వేసిన ఆ చిత్రం సౌందర్యలహరి ఏమైందీ?" వొణికిపోతూ అడిగాడు. రవి ఏదో చెప్పబోయేంతలో–

"ఇదిగో – " అంటూ వినిపించిందొక కంఠం హాలులోంచి.

శరత్, రవి అక్కడికి వెళ్ళారు.

"శరత్! ఎప్పుడొచ్చావు?" పలకరించాడు రాజారావ్. అతనితోపాటు మరో యువకుడు.. ప్రక్కన ఆమె! సౌందర్యలహరి..

శరత్‌కేమీ అర్థంకాలేదు. ఒక పక్క ఆశ్చర్యం.. మరో పక్క ఆనందం.. ఇంకొక పక్క భయం.

"మీరేనా శరత్‌చంద్ర?" కఠినంగా ఉందతని కంఠం.

"ఊఁ" అన్నాడతను.

"నీ పేరు శేఖర్.. ఈమె నా భార్య.. సౌందర్యలహరి."

"నమస్కారం. నమస్కారం."

"మిస్టర్ శరత్! మీరీ చిత్రాన్ని ఎలా గీశారు? ఎందుకు గీశారు? మీకు సౌందర్యలహరి తెలుసా?" నిలదీస్తున్నట్లే అడిగాడు శేఖర్.

"నేను.. ఏ ఉద్దేశంతోనూ గియ్యలేదు. నిజం. నన్ను నమ్మండి. వారం కిందట. పారిశ్రామిక ప్రదర్శన ఆవరణలో మొదటిసారిగా ఒక నిముషంపాటు చూశాను. వారి సౌందర్యం నన్ను కదిలించింది. కుదిపి కుదిపి వదిలింది. అంత సౌందర్యాన్ని ప్రత్యక్షంగా ఎప్పుడూ చూడలేదు.

నాలోని చిత్రకళ – నన్ను వేదనకి గురిచేసింది. ఇంటికి వచ్చినా స్తిమితపడనివ్వలేదు. ఆ తియ్యని బాధనుంచి బయటపడేందుకూ నాకు నా కళే మార్గం చూపింది. నేను చూసిన సజీవ సౌందర్యాన్ని చిత్రించాను. కాలగమనం కూడా మరచి, తదేక దీక్షగా. చిత్రం పూర్తిచేశాక నా మనసు తేలిక పడింది. నేను మళ్ళీ మనిషిని కాగలిగాను. కళాకారుడికి అరుదుగా అయినా ఎదురయ్యే ఈ అవస్థ అనుభవిస్తేనే బాగా తెలుస్తుంది. నా మనసులో ఏ అపవిత్ర భావమూ లేదనడానికి నిదర్శనం. ఆ చిత్రంలో అసభ్యత అనేది ఉండకపోవడమే. సౌందర్యలహరి నేను చిత్రానికి పెట్టుకున్నపేరు. ఆమె మెడలోని మంగళసూత్రం కూడా ఆమె సౌందర్యానికి వన్నెతెచ్చేదే. చిత్రకారుడిగా నేను సౌందర్యారాధకుడినే తప్ప యింకేమికాను. చిత్రం గీశాక – కళాకారుడినుంచి మళ్ళీ మనిషినై ఆలోచించగా – "నేను తప్పు చేశానేమో వివాహిత.. పరస్త్రీ.. ఆమె చిత్రాన్ని గీసేందుకు నాకు హక్కేముంది? అనుమతి తీసుకోలేదు. ఎలాగో ఆమెను వెదికి కళాకారుడి ఆవేశంలోనూ, ఉద్వేగంలోనూ చేసిన తప్పు చెప్పుకుని క్షమించగోరుతూ చిత్రాన్ని ఆమెకిచ్చెయ్యాలనుకున్నాను. కానీ ఆమె పేరు.. ఊరు.. ఏమీ తెలియదు. ఎలా? అని ఆలోచిస్తూనే నిద్రపోయాను. మర్నాడే నేను అర్జెంటుగా ఊరెళ్ళవలసి వచ్చింది." అని ఆగాడు శరత్‌చంద్ర.

"సరిగ్గా అప్పుడే ఒక మంచి స్పాన్సర్ అర్జంటుగా స్థానిక చిత్రకారుల చిత్రాల ప్రదర్శన, పోటీ, అమ్మకాలు పెట్టమన్నాడు. నువ్వేమో ఊళ్ళో లేవు. నా టెలిఫోన్ రవి అందుకుని – చిత్రం ఉందనగానే నేను వచ్చి తీసుకువెళ్ళాను. రవికీ, నాకూ ఈ చిత్రం వెనుక కథేమీ తెలియదుగా?

ప్రేక్షకుల ఎంపిక బట్టి ప్రథమ బహుమతీ, న్యాయనిర్ణేతలను బట్టి ద్వితీయ బహుమతీ వొచ్చాయి. ఆ చెక్కులు ఇవిగో. వీరిద్దరూ నా వద్దకు వచ్చి – ఆ చిత్రం కొనుక్కున్నారు. ఏదో హడావిడిలో నేను శ్రీమతి శేఖర్‌ని చూడనే లేదు. వారు దీనిని వెయ్యి రూపాయిలకి కొన్నారు. ఇదిగో ఆ చెక్కు –" అందించబోయాడు రాజారావ్.

తీసుకోనన్నట్టు అడ్డంగా తలూపాడు శరత్‌చంద్ర. "నావల్ల జరిగిన పొరపాటుకి పరిహారంగా వాటిని శ్రీమతి సౌందర్యలహరిగారికే ఇచ్చెయ్యండి. ఆ చిత్రం కూడా వారికే చెందుతుంది. దానినేం చేసుకున్నా వారిష్టమే." శేఖర్ అతని వేపు ఆశ్చర్యంగా చూశాడు.

శరత్‌చంద్ర తలవంచుకుని "శేఖర్ గారూ, సౌందర్యలహరిగారూ! నన్ను క్షమించండి. నేను తొందరపాటుతో చేసిన పనికి యిలాగ.. యిన్ని పరిణామాలు సంభవించగలవను కోలేదు. అందుకే అంటారేమో– కళాకారులకి ప్రపంచ జ్ఞానం తక్కువ– అని. ఈ చిత్రం మీ దంపతులకి ఏ మాత్రం కలత కలిగించినా – క్షమించమని మళ్ళీ కోరుతున్నాను." అని స్టుడియో గదిలోకి వెళ్ళిపోయాడు శరత్‌చంద్ర. తాను గీసిన చిత్రంకంటే విచిత్రంగా ఉన్నాడు చిత్రకారుడు – అనుకున్నారు సౌందర్యలహరీ, శేఖరూ. ❋

